సాక్షి నిర్మల్
బుధవారం । 10 । జనవరి । 2024



మానవీయతకు పెద్దపీట వేయాలి

ప్రపంచంలో మానవ సంబంధాలు కనుమరుగవుతున్నాయని వక్తలు అభిప్రాయపడ్డారు. భైంసాలో నిర్వహించిన జాతీయ హిందీ సెమినార్‌లో మాట్లాడారు. 8లో▸

మంత్రి సీతక్కను కలిసిన డీఆర్డీవో



నిర్మల్‌చైన్‌గేట్:పంచాయతీరాజ్, గ్రామీణ అభివృద్ధిశాఖ మంత్రి సీతక్క, ఆ శాఖ ప్రధాన కార్యదర్శి సందీప్ కుమార్ సుల్తానీయాను డీఆర్డీవో విజయలక్ష్మి మంగళవారం హైదరాబాదులో కలిశారు. జిల్లా మహిళలు తయారు చేసిన వస్తువులు అందించారు.

గరిష్ఠం/కనిష్ఠం
28.5/18.5

వాతావరణం

ఆకాశం కొంతమేర మేఘావృతమవుతుంది. ఉష్ణోగ్రతలు సాధారణంకన్నా తక్కువగా నమోదవుతాయి. చలి ప్రభావం కాస్త తగ్గుతుంది. పొగమంచు కురుస్తుంది.

న్యూస్‌రీల్

పన్నులు సకాలంలో చెల్లించాలి



హాస్పిటల్ సీజ్ చేస్తున్న మున్సిపల్ సిబ్బంది

నిర్మల్‌టౌన్: ఇంటి, ఆస్తి పన్నులు సకాలంలో చెల్లించి మున్సిపల్ అభివృద్ధికి సహకరించాలని మున్సిపల్ రెవెన్యూ ఆఫీసర్ గంగాధర్ అన్నారు. జిల్లా కేంద్రంలోని హాస్పిటల్ లైన్‌లో ఎర్రవోతు ముత్తన్న పేరు మీద ఉన్న ప్రియా నర్సింగ్ హోమ్, మరో డెంటల్ ఆసుపత్రిని పన్నులు చెల్లించకపోవడంతో మంగళవారం సీజ్ చేశారు. వీరు మూడేళ్లుగా పన్ను చెల్లించడం లేదని తెలిపారు. రూ.5.30 లక్షల బకాయి ఉన్నట్లు పేర్కొన్నారు. నోటీసులు ఇచ్చినా స్పందించకపోవడంతో సీజ్ చేసినట్లు తెలిపారు. అనంతరం భవనానికి నోటీసులు అంటించారు.

ఈవీఎం గోదాం తనిఖీ

నిర్మల్‌చైన్‌గేట్:నిర్మల్ రూరల్ మండలం ఎల్లపల్లి వద్ద ఉన్న ఈవీఎం, వీవీ ప్యాట్ గోదాంను కలెక్టర్ ఆశిష్ సంగ్వాన్, అదనపు కలెక్టర్ కిషోర్ కుమార్‌తో కలిసి మంగళవారం తనిఖీ చేశారు. తాళానికి వేసిన సీల్, సీసీ కెమెరాలో రికార్డు అవుతున్న పుటేజీలను పరిశీలించారు. తనిఖీ రిజిస్టర్‌లో సంతకం చేశారు. ఎన్నికల సంఘం ఆదేశాల మేరకు ఈవీఎం గోదాంను తనిఖీ చేసినట్లు చెప్పారు. తనిఖీ నివేదికను ఎన్నికల సంఘం కార్యాలయానికి పంపించాలని ఎన్నికల సెక్షన్ పర్యవేక్షకులకు సూచించారు. వారివెంట ఆర్డీవో రత్నకళ్యాణి, ఎన్నికల అధికారి శ్రీనివాస్ ఉన్నారు.

పోయిన ఫోన్లు అప్పగింత

నిర్మల్‌టౌన్: జిల్లాలోని వివిధ పోలీస్ స్టేషన్ల పరిధిలో పోగొట్టుకున్న 24 మొబైల్ ఫోన్లను సీఈఐఆర్ వెబ్‌సైట్ ద్వారా పోలీసులు రికవరీ చేశారు. వాటిని ఎస్పీ జానకి షర్మిల చేతుల మీదుగా మంగళవారం బాధితులకు అందజేశారు. ఈ సందర్భంగా ఎస్పీ మాట్లాడుతూ.. సెకండ్ హ్యాండ్ ఫోన్ కొనే ముందు సీఈఐఆర్ వెబ్‌సైట్‌లో ఫోన్ ఐఎంఈఐ నంబర్ చెక్ చేసుకోవాలని సూచించారు. పోయిన ఫోన్ల రికవరీకి పోలీసులు పలు రకాల సాంకేతిక పరిజ్ఞానం వినియోగిస్తున్నట్లు వెల్లడించారు. కొత్తగా ప్రవేశపెట్టిన సెంట్రల్ ఎక్విప్మెంట్ ఐడెంటిటీ రిజిస్టర్ (సీఈఐఆర్) అప్లికేషన్ ఎంతో ఉపయోగపడుతుందని తెలిపారు. ఈ వెబ్‌సైట్ ద్వారా జిల్లాలో ఇప్పటి వరకు 421 ఫోన్లు రికవరీ చేసినట్లు వెల్లడించారు. కార్యక్రమంలో డీఎస్పీ గంగారెడ్డి, ఎస్బీ ఇన్‌స్పెక్టర్ శ్రీనివాస్, పట్టణ సీఐ పురుషోత్తం, ఐటీకోర్ ఇన్‌చార్జి రవికుమార్, వివిధ పోలీస్‌స్టేషన్ల సిబ్బంది పాల్గొన్నారు.

డాక్టర్ పోస్టులకు దరఖాస్తుల ఆహ్వానం

నిర్మల్‌చైన్‌గేట్:కలెక్టర్ ఆదేశాల మేరకు జిల్లాలోని తెలంగాణ వైద్య విధాన పరిషత్ ఆసుపత్రుల్లో ఖాళీగా ఉన్న వైద్య పోస్టుల భర్తీకి దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు డీసీహెచ్ఎస్ డాక్టర్ దేవేందర్‌రెడ్డి తెలిపారు. గైనకాలజిస్ట్ 2, జనరల్ సర్జన్ - 1, పీడియాట్రిస్ట్ - 2, సివిల్ అసిస్టెంట్ సర్జన్ పోస్టులకు అర్హత, ఆసక్తి ఉన్నవారు దరఖాస్తు చేసుకోవాలని సూచించారు. ఔట్‌సోర్సింగ్ ప్రాతిపదికన పనిచేయాల్సి ఉంటుందని తెలిపారు. ఆసక్తి ఉన్నవారు దరఖాస్తులను జిల్లా ఆసుపత్రుల పర్యవేక్షణ అధికారి కార్యాలయంలో ఈనెల 11 నుంచి 18వ తేదీ వరకు అందించాలని పేర్కొన్నారు. ఎంపిక ప్రక్రియ కలెక్టర్ కార్యాలయంలో జరుగుతుందని తెలిపారు.

చైనా మాంజా విక్రయిస్తే చర్యలు



తనిఖీలు చేస్తున్న అటవీ శాఖ అధికారులు

భైంసాటౌన్:చైనా మాంజా విక్రయిస్తే కఠిన చర్యలు తీసుకుంటామని ఎఫ్ఆర్వో రమేశ్ హెచ్చరించారు. పట్టణంలోని పలు పతంగుల విక్రయ దుకాణాల్లో బాసర సర్కిల్ ఫ్లయింగ్ స్క్వాడ్ బృందం మంగళవారం తనిఖీలు చేపట్టింది. పలు దుకాణాల్లో చైనా మాంజా విక్రయాలపై ఆరా తీశారు. ఓ దుకాణంలో అనుమానిత మాంజా నమూనాను సేకరించారు. అనంతరం ఎఫ్ఆర్వో మాట్లాడుతూ పతంగులు ఎగురవేసేందుకు వినియోగిస్తున్న చైనా మాంజాతో పక్షులు, మూగజీవాలు మృత్యువాత పడుతున్నాయన్నారు. ఎవరైనా చైనా మాంజా విక్రయిస్తే చర్యలు తప్పవన్నారు. ఆయన వెంట ఎఫ్ఎస్వో రషీద్, హర్షద్, కోటేశ్ ఉన్నారు.

ప్రశ్నిస్తారా.. వదిలేస్తారా..?



జిల్లా పరిషత్ భవనం

- అసెంబ్లీ ఎన్నికల తర్వాత.. జెడ్పీ తొలి సమావేశం
- జిల్లా పరిషత్‌తో పెరిగిన ప్రతిపక్షం బలం
- సమస్యలపై చర్చకు ఆస్కారం

నిర్మల్:అసెంబ్లీ ఎన్నికల ఫలితాల ప్రభావం అన్నింటిపై పడుతోంది. నిర్మల్, ఖానాపూర్ మున్సిపాలిటీలతోపాటు మండలపరిషత్‌లపైనా పడింది. జిల్లా పరిషత్ పాలకవర్గాన్నీ అవిశ్వాసం కదలిక కలవరపెట్టింది. ఇలాంటి సందర్భంలో జెడ్పీ సర్వసభ్య సమావేశం బుధవారం నిర్వహిస్తున్నారు. అసెంబ్లీ ఎన్నికల తర్వాత తొలి సమావేశం కావడం ,ఇందులో గతానికి భిన్నంగా ప్రతిపక్ష సభ్యుల బలం పెరగడంతో ఆసక్తి నెలకొంది. జిల్లాలోని ముగ్గురు ఎమ్మెల్యేలతోపాటు గతంలోని పలువురు జెడ్పీటీసీ సభ్యులూ ప్రస్తుత పాలకవర్గానికి ప్రతిపక్షంగా ఉండటమే ఇందుకు కారణం. ఎప్పుడూ సాదాసీదాగా సాగే ఈ సర్వసభ్య సమావేశం ఈసారి ఎలా ఉంటుందోనన్న ఆసక్తి అందరిలో ఉంది. కొత్త ఎమ్మెల్యేలు సమస్యలను లేవనెత్తుతారా.. లేక మమ అనిపిస్తారా.. అనే దానిపైనా చర్చ జరుగుతోంది.

తొలి సమావేశం..

గతేడాది నవంబర్ 30న అసెంబ్లీ ఎన్నికలు, డిసెంబర్ 3న ఫలితాలు రావడంతో జిల్లాలో సీన్ మొత్తం మారిపోయింది. నిర్మల్, ముధోల్, ఖానాపూర్ మూడుచోట్లా బీఆర్ఎస్ ఓడిపోయింది. దీంతో జిల్లాలో రాజకీయం మారుతూ వస్తోంది. ఎన్నికల నేపథ్యంలో మూడునెలల తర్వాత జిల్లా పరిషత్ సర్వసభ్య సమావేశాన్ని బుధవారం నిర్వహిస్తున్నారు. కొత్త ఏడాదిలో, రాష్ట్రంలో కొత్త ప్రభుత్వం కొలువుదీరాక తొలి సమావేశంగా ఇదే. ఆహ్వానం అందుకున్న ముగ్గురు ఎమ్మెల్యేల్లో మహేశ్వర్‌రెడ్డి గతంలో ఎమ్మెల్యేగా అనుభవం ఉండగా, ముధోల్ ఎమ్మెల్యే రామారావుపటేల్, ఖానాపూర్ వెడ్మబొజ్జు ఇద్దరూ జెడ్పీ సమావేశానికి హాజరు కావడం ఇదే తొలిసారి.

ఎలా ఉంటుందో..

మొన్నటి వరకు జిల్లా పరిషత్‌లో అందరూ ఏకపక్షమే. మంత్రిగా ఉన్న ఇంద్రకరణ్‌రెడ్డి కూడా స్థానికంగా ఉండటం, సమావేశాల్లో పాల్గొనడంతో ఎదురులేకుండా నడిచింది. ఇప్పుడు ప్రతిపక్షం బలం పెరిగింది. ముగ్గురు ఎమ్మెల్యేల్లో ఇద్దరు బీజేపీ, ఒకరు కాంగ్రెస్ ఉన్నారు. అసెంబ్లీ ఎన్నికలకు ముందు బీఆర్ఎస్‌వైపు ఉన్న పలువురు జెడ్పీటీసీలు పార్టీలు మారారు. ఇప్పుడు కాంగ్రెస్, బీజేపీలకు చెప్పుకోదగ్గ సభ్యులు పరిషత్‌లో ఉన్నారు. ఒక దశలో చైర్‌పర్సన్ విజయలక్ష్మినే దింపేసేందుకు అవిశ్వాసంవైపు అడుగులు పడ్డాయి. ఇలాంటి సందర్భంలో జిల్లా పరిషత్ సర్వసభ్య సమావేశం ఎలా ఉండబోతుందో అన్న ఆసక్తి నెలకొంది.

సమస్యలపై చర్చిస్తారా..

సొంత పార్టీ చైర్‌పర్సన్ ఉండటంతో బీఆర్ఎస్ సభ్యులు గతంలో పెద్దగా సమస్యలపై స్పందించిన దాఖలాలు లేవు. ఒకరిద్దరు బీఆర్ఎస్ సభ్యులే బలంగా తమ గళం వినిపించారు. మంత్రి హోదాలో ఇంద్రకరణ్‌రెడ్డి ఉండటంతో అడగడానికీ చాలామంది ముందుకు రాలేదు. చాలా ప్రశ్నలకూ ఆయనే సమాధానాలు చెప్పేవారు. జిల్లాలో పేరుకుపోయిన చాలా సమస్యలు సమావేశం దృష్టికి కూడా రాకుండాపోయాయి. తాజాగా ఎన్నికైన కొత్త ఎమ్మెల్యేలు మాత్రం తమ నియోజకవర్గాల్లో సమస్యలపై సీరియస్‌గా స్పందిస్తున్నారు. ఈనేపథ్యంలో జెడ్పీ సర్వసభ్య సమావేశంలో వీటిపై ప్రశ్నిస్తారా..! లేక వదిలేస్తారా..? మిగితా సభ్యులూ స్పందిస్తారా..! పాలకవర్గం ఎలా సమాధానం ఇస్తుంది.. అన్న చర్చ జిల్లా వ్యాప్తంగా జరుగుతోంది.

అత్యాశకు పోతే అంతే..!



సమావేశంలో మాట్లాడుతున్న ఎస్పీ జానకి షర్మిల

- సైబర్ నేరాలపై అప్రమత్తంగా ఉండాలి
- ఎస్పీ జానకి షర్మిల
- ఆన్‌లైన్ వలలో చిక్కి రూ.18.95 లక్షలు పోగొట్టుకున్న జిల్లావాసి..
- రూ.13.19 లక్షలు రికవరీ చేసినట్లు వెల్లడి

నిర్మల్‌టౌన్ : సైబర్ మోసాలపై ప్రజలు అప్రమత్తంగా ఉండాలని, ఆన్‌లైన్ పేరిట వచ్చే ప్రకటనలు చూసి అత్యాశకు పోతే తీవ్రంగా నష్టపోతారని ఎస్పీ డాక్టర్ జానకి షర్మిల అన్నారు. జిల్లా కేంద్రానికి చెందిన అనుపోల్ల దీక్షిత్‌కుమార్ సైబర్ వలలో చిక్కి రూ.18,95,990 పోగొట్టుకోగా, వాటిలో రూ.13.19 లక్షలు రికవరీ చేసినట్లు తెలిపారు. జిల్లా పోలీస్ కార్యాలయంలో మంగళవారం ఏర్పాటు చేసిన సమావేశంలో రికవరీ చేసిన సొత్తును బాధితుడికి అందించారు. అనంతరం మాట్లాడారు. పట్టణంలోని ప్రియదర్శినినగర్‌కు చెందిన దీక్షిత్ కుమార్ బ్యాంకు అకౌంట్‌లో ఉన్న రూ.18,95,990 నగదును 2023, ఆగస్టు 22న సైబర్ దొంగలు కాజేశారు.

టెలీగ్రామ్ లింక్ క్లిక్ చేసి..

ఆగస్టు 14న టెలిగ్రామ్‌లో పార్ట్ టైం జాబ్ గురించి దీక్షిత్‌కుమార్ ఫోన్‌కు మెస్సేజ్ వచ్చింది. వెంటనే దానిని క్లిక్‌చేసి సంప్రదించాడు. దీంతో గుర్తు తెలియని వ్యక్తి దీక్షిత్ వివరాలతో ఒక వర్చువల్ అకౌంట్ క్రియేట్ చేశాడు. అందులో రూ.10 వేలు డిపాజిట్ చేసినట్లు చూపించాడు. తరువాత గుర్తుతెలియని వ్యక్తి దీక్షిత్‌కు కొన్ని టాస్కులు ఇచ్చాడు. వాటిని పూర్తి చేయడంతో వర్చువల్ అకౌంట్‌లో రూ.1,019 జమ అయినట్లు చూపించాడు. టాస్కులు పూర్తిచేస్తే డబ్బులు వస్తాయని గుర్తు తెలియని వ్యక్తి నమ్మించాడు. ఆగస్టు 17 నుంచి 19 వరకు దీక్షిత్‌తో రూ.18,95,990 వివిధ అకౌంట్లలో జమ చేయించాడు. తర్వాత టాస్కులు చేసినా డబ్బులు రాలేదు. దీంతో దీక్షిత్ తన డబ్బులు తనకు ఇచ్చేయమని అడుగగా సెక్యూరిటీ డిపాజిట్ కింద 50 శాతం డబ్బులు కడితేనే తిరిగి ఇస్తామని చెప్పడంతో మోసపోయినట్లు గ్రహించాడు.

పోలీసులకు ఫిర్యాదు..

ఈమేరకు బాధితుడు పోలీసులకు ఫిర్యాదు చేశాడు. పట్టణ సీఐ పురుషోత్తం కేసు నమోదు చేశారు. బాధితుడు తన డబ్బును ఏడు ఐసీఐసీఐ బ్యాంకు, రెండు ఎస్ బ్యాంకు అకౌంట్లకు పంపినట్లు దర్యాప్తులో గుర్తించారు. వెంటనే అప్రమత్తమై బాధితుడి ఖాతా నుంచి డబ్బులు విత్‌డ్రా చేయకుండా సైబర్ క్రైమ్ ఇన్‌చార్జి రవికుమార్ సహాయంతో ఆయా బ్యాంకులకు నోటీసులు ఇచ్చి ఫ్రీజ్ చేసినట్లు తెలిపారు. తర్వాత రీఫండ్ గురించి కోర్టులో పిటిషన్ ఫైల్ చేయగా ఆగస్టు 21న కోర్టు రీఫండ్ ఆర్డర్ తీసుకుని బాధితుడికి రూ.13,19,914 అప్పగించినట్లు వివరించారు. కేసును ఛేదించిన సీఐ పురుషోత్తంచారి, సైబర్ క్రైమ్ జిల్లా ఇన్‌చార్జి రవికుమార్, ఆర్ఎస్సై నరేందర్, ఏపీపీ సతీశ్‌ను ఎస్పీ అభినందించారు.

సైన్స్‌పై మక్కువ పెంచుకోవాలి



కేజీబీవీ పాఠశాలలో మొబైల్ సైన్స్ ల్యాబ్‌ను జ్యోతి వెలిగించి ప్రారంభిస్తున్న కలెక్టర్ ఆశిష్ సంగ్వాన్

- కలెక్టర్ ఆశిష్ సంగ్వాన్
- మొబైల్ సైన్స్ ల్యాబ్ ప్రారంభం



ప్రాజెక్టులను పరిశీలిస్తున్న కలెక్టర్, డీఈవో

నిర్మల్ రూరల్: విద్యార్థులు సైన్స్‌పై మక్కువ పెంచుకుని, పరిశోధనలు చేయాలని కలెక్టర్ ఆశిష్ సంగ్వాన్ సూచించారు. జిల్లా కేంద్రంలోని కేజీబీవీ పాఠశాలలో అగస్త్య ఫౌండేషన్ ఆధ్వర్యంలో నిర్వహించే మొబైల్ సైన్స్ ల్యాబ్‌ను మంగళవారం ప్రారంభించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడారు. మొబైల్ సైన్స్ ల్యాబ్‌తో విద్యార్థుల వద్దకే ప్రయోగాత్మక బోధన వస్తుందన్నారు. దీనిని సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. విద్యార్థులు ప్రశ్నించే తత్వం అలవాటు చేసుకోవాలన్నారు. సంస్థ జనరల్ మేనేజర్ బలరాం, ఏరియా మేనేజర్ శ్రీదేవి మాట్లాడుతూ.. తమ సంస్థ ద్వారా మొబైల్ సైన్స్ ల్యాబ్‌లను జిల్లాలో 8 పాఠశాలల్లో ప్రవేశపెడుతున్నామన్నారు. 23 రాష్ట్రాల్లో ఈ సేవలు అందిస్తున్నట్లు తెలిపారు. విద్యార్థుల్లో సృజనాత్మకత, తెలుసుకోవాలనే కుతూహలం, ప్రేరేపించడం, ప్రయోగాత్మకమైన బోధన ద్వారా ప్రతీ గ్రామీణ ప్రాంత విద్యార్థికి సైన్స్‌లో మెలకువలు నేర్పడానికి సైన్స్ పరిజ్ఞానం విస్తృతం చేయడానికి కృషి చేస్తామన్నారు. అనంతరం విద్యార్థులు తయారుచేసిన సైన్స్ ప్రయోగాలను కలెక్టర్, డీఈవో రవీందర్‌రెడ్డి, అధికారులు పరిశీలించారు. వాటి పనితీరును అడిగి తెలుసుకున్నారు. కార్యక్రమంలో జిల్లా సైన్స్ అధికారి వినోద్‌కుమార్, ఎంఈవో శంకర్, సెక్టోరియల్ ఆఫీసర్లు శ్రీదేవి, నర్సయ్య, పరీక్షల సహాయ కమిషనర్ పద్మ, కేజీబీవీ స్పెషల్ ఆఫీసర్లు సుజాత, లత, దేవి తదితరులు పాల్గొన్నారు.

రైస్ మిల్లును తనిఖీ చేసిన కలెక్టర్




రికార్డులు పరిశీలిస్తున్న కలెక్టర్ ఆశిష్ సంగ్వాన్

సారంగపూర్: మండలంలోని స్వర్ణ గ్రామంలో ఉన్న లక్ష్మీనర్సింహా రైస్ మిల్లును కలెక్టర్ ఆశిష్ సంగ్వాన్ మంగళవారం రాత్రి తనిఖీ చేశారు. మిల్లుకు కేటాయించిన ధాన్యం వివరాలు, ఇప్పటి వరకు మిల్లింగ్ చేసిన ధాన్యం వివరాలను అడిగి తెలుసుకున్నారు. ప్రభుత్వ నిబంధనల ప్రకారం ధాన్యం అందించాలని సూచించారు. నిబంధనలను అతిక్రమిస్తే చర్యలు తప్పవని హెచ్చరించారు. అనంతరం మండలంలోని స్వర్ణ ప్రాజెక్టు గురించి స్థానిక అధికారులను అడిగి తెలుసుకున్నారు. యాసంగికి నీరు విడుదలపై ఆరా తీశారు. కలెక్టర్ వెంట ఆర్డీవో రత్నకళ్యాణి, తహసీల్దార్ శ్రీదేవి, ఎంపీడీవో సరోజ ఉన్నారు.

ఉపాధ్యాయ సమస్యల పరిష్కారానికి కృషి

- ఎమ్మెల్యే ఏలేటి మహేశ్వర్‌రెడ్డి



క్యాలెండర్ ఆవిష్కరిస్తున్న మహేశ్వర్‌రెడ్డి

నిర్మల్ రూరల్:ఉపాధ్యాయ సమస్యల పరిష్కారానికి తన వంతు కృషి చేస్తానని ఎమ్మెల్యే ఏలేటి మహేశ్వర్‌రెడ్డి తెలిపారు. స్టేట్ టీచర్స్ యూనియన్(ఎస్టీయూ) ఆధ్వర్యంలో రూపొందించిన క్యాలెండర్, డైరీ లను జిల్లా కేంద్రంలోని క్యాంపు కార్యాలయంలో మంగళవారం ఆవిష్కరించారు. నూతన సంవత్సర శుభాకాంక్షలు తెలిపారు. ఉపాధ్యాయులకు అండగా ఉంటామన్నారు. కార్యక్రమంలో జిల్లా అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు ఎస్.భూమన్నయాదవ్, జె.లక్ష్మణ్, రాష్ట్ర అసోసియేట్ అధ్యక్షుడు జుట్టు గజేందర్, రాష్ట్ర కార్యదర్శులు గంగాధర్, సిరాజుద్దీన్, జిల్లా ఆర్థిక కార్యదర్శి శ్రీనివాస్, వివిధ మండలాల బాధ్యులు, జిల్లా కార్యవర్గ సభ్యులు, ప్రాథమిక సభ్యులు పాల్గొన్నారు.

చలాన్ల రాయితీకి స్పందన అంతంతే

- నేటితో ముగియనున్న గడువు



భైంసాటౌన్:ట్రాఫిక్ నిబంధనల ఉల్లంఘనలకు పాల్పడి వాహనాలపై చలాన్లు పెండింగ్ ఉన్న వారికి ప్రభుత్వం భారీ రాయితీ కల్పించింది. డిసెంబర్ 25కు ముందు వాహనాలపై ఉన్న చలాన్లను రాయితీతో చెల్లించే అవకాశం కల్పించింది. ఈ గడువు బుధవారంతో ముగియనుంది. జిల్లాలో అన్ని వాహనాలపై కలిపి రూ.5,59,280 చలాన్లు పెండింగ్‌లో ఉండగా, ఇప్పటి వరకు రూ.1,25,321 మాత్రమే చెల్లించారు. నేటితో గడువు ముగియనున్న నేపథ్యంలో వాహనదారులు పెండింగ్ చలాన్లపై రాయితీని సద్వినియోగం చేసుకోవాలని పోలీసులు సూచిస్తున్నారు.

రాయితీ ఇలా...

ద్విచక్ర, త్రిచక్ర వాహనాల పెండింగ్ చలాన్లపై 80 శాతం రాయితీ, నాలుగు చక్రాల వాహనాలపై 60 శాతం, బస్సులు, తోపుడు బండ్లపై 90 శాతం రాయితీని ప్రభుత్వం కల్పించింది.

చలాన్ రాయితీ వినియోగించుకోవాలి

వాహనాల చలాన్లపై ఇస్తున్న రాయితీని వినియోగించుకోవాలని ఎస్పీ సూచించారు. వాహనాలపై గతేడాది డిసెంబర్ 25వ తేదీ వరకు విధించిన చలాన్లను క్లియర్ చేసేందుకు ఈ నెల 10వ తేదీ వరకు ప్రభుత్వం రాయితీ కల్పించిందని తెలిపారు. జిల్లాలో అన్ని వాహనాలపై కలిపి 5,59,280 చలాన్లు ఉండగా, ఇప్పటి వరకు 1,25,321 చలాన్లను మాత్రమే కట్టారని పేర్కొన్నారు. బుధవారంతో గడువు ముగుస్తుందని, ఈ అవకాశాన్ని సద్వినియోగించుకోవాలని సూచించారు. సమావేశంలో డీఎస్పీ గంగారెడ్డి, ఎస్బీ ఇన్‌స్పెక్టర్ శ్రీనివాస్, సీఐ పురుషోత్తం తదితరులు పాల్గొన్నారు.

వృత్తి నైపుణ్య శిక్షణ కేంద్రం ప్రారంభం



కేంద్రాన్ని ప్రారంభిస్తున్న కలెక్టర్

నిర్మల్‌చైన్‌గేట్:జిల్లా అడ్మినిస్ట్రేషన్ భాగస్వామ్యంతో యాక్సెంచర్ సొల్యూషన్స్ ప్రైవేట్ లిమిటెడ్ ఆధ్వర్యంలో నిర్మల్‌లో ఏర్పాటు చేసిన ఇంటిగ్రేటెడ్ మోడల్ ఫర్ స్కిల్ డెవలప్‌మెంట్, మైక్రో ఎంటర్‌ప్రైస్ డెవలప్‌మెంట్, సెల్ఫ్ ఎంప్లాయ్‌మెంట్ సంస్థను కలెక్టర్ ఆశిష్ సంగ్వాన్ మంగళవారం ప్రారంభించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ యువతకు వరం వత్తి నైపుణ్య శిక్షణ కేంద్రం అని అన్నారు. సంస్థ ప్రతినిధులు మాట్లాడుతూ జిల్లాలో 500 మంది యువతకి స్కిల్ డెవలప్‌మెంట్, మైక్రో ఎంటర్‌ప్రైజెస్ సెల్ఫ్ ఎంప్లాయ్‌మెంట్ ద్వారా లబ్ధి చేకూరుతుందన్నారు. ఈ కేంద్రంలో మహిళలకు ప్రాధాన్యం ఉంటుందని తెలిపారు. 18 నుంచి 30 ఏళ్లలోపు వయసు ఉన్నవారు8374931781, 9154914703 నంబర్లలో సంప్రదించాలని సూచించారు.

పిల్లలను పనిలో పెట్టుకోవద్దు

- బాలల సంరక్షణ అధికారి దేవి మురళి

నిర్మల్‌చైన్‌గేట్:పిల్లలను పనిలో పెట్టుకోవద్దని, ఎవరైనా బడీడు పిల్లలను పనిలో పెట్టుకుంటే కఠిన చర్యలు తీసుకుంటామని జిల్లా బాలల సంరక్షణ అధికారి దేవి మురళి హెచ్చరించారు. ఆపరేషన్ స్మైల్ బృందం ముధోల్ మండలం నిగ్వ గ్రామంలో బడి మానేసిన బాలుడిని మంగళవారం గుర్తించింది. బాలుడి తల్లిదండ్రులకు కౌన్సెలింగ్ ఇప్పించి నిర్మల్‌లోని కూరన్నపేటలో ఉన్న అర్బన్ రెసిడెన్షియల్ స్కూల్లో 6వ తరగతిలో చేర్పించారు. పిల్లలకు సంబంధించిన ఎటువంటి సమస్యలు ఉన్నా టోల్ ఫ్రీ నెంబర్ 1098కు సమాచారం ఇవ్వాలని సూచించారు. కార్యక్రమంలో అర్బన్ రెసిడెన్షియల్ స్కూల్ ప్రిన్సిపల్ క్రాంతికుమార్, చైల్డ్‌లైన్ కోఆర్డినేటర్ నల్ల గంగాధర్ పాల్గొన్నారు.



బాలుడిని బడిలో చేర్పిస్తున్న బాలల సంరక్షణాధికారి

నిర్మల్ చరిత్ర గ్రంథస్తం అభినందనీయం

- అదనపు కలెక్టర్ ఫైజాన్ అహ్మద్
- 'నిర్మల్ జిల్లా సమగ్రస్వరూపం' గ్రంథం ఆవిష్కరణ



గ్రంథం ఆవిష్కరిస్తున్న అదనపు కలెక్టర్, కవులు

నిర్మల్ ఖిల్లా:కవులు, కళాకారులు, సాహితీవేత్తలకు నిలయమైన నిర్మల్ జిల్లా సమగ్ర చరిత్రను గ్రంథస్తం చేయడం అభినందనీయమని అదనపు కలెక్టర్ ఫైజాన్ అహ్మద్ అన్నారు. జిల్లా కేంద్రంలోని విశ్రాంత ఉద్యోగుల సంఘ భవనంలో మంగళవారం ఏర్పాటు చేసిన కార్యక్రమంలో 'నిర్మల్ జిల్లా సమగ్రస్వరూపం' గ్రంథం ఆవిష్కరించారు. అనంతరం అదనపు కలెక్టర్ మాట్లాడారు. ఈ గ్రంథాన్ని కోర్ కమిటీ కన్వీనర్ తుమ్మల దేవరావు ఆధ్వర్యంలో నిర్మల్ జిల్లాకు చెందిన 46 మంది కవులు, రచయితలు సమష్టిగా జిల్లా సమగ్ర చరిత్రను వెలుగులోకి తెచ్చారని తెలిపారు. దాదాపు 400 పేజీలలో పలు రంగాలకు చెందిన అంశాలను గ్రంథస్థం చేయడం గొప్ప విషయమన్నారు. తెలంగాణ సారస్వత పరిషత్ సమన్వయంతో ఈ గ్రంథాన్ని పాఠకులు, ప్రజలకు అందుబాటులోకి తెచ్చినట్లు ఆ సంస్థ ప్రధాన కార్యదర్శి జుర్రు చిన్నయ్య తెలిపారు. ఈ గ్రంథానికి చిన్నయ్య సంపాదకులుగా వ్యవహరించారు. నిర్మల్ జిల్లాకు చెందిన సాహిత్యం, జాతరలు, కోటలు- గఢులు, భౌగోళిక స్థితిగతులు, శిల్పులు, చిత్రకారులు రాజకీయ నేపథ్యం-చరిత్ర, వ్యవసాయ రంగం, నిర్మల్ కొయ్య బొమ్మలు జానపద గిరిజన సంప్రదాయ విశిష్టత వంటి పలు అంశాలను ఈ గ్రంథంలో పొందుపరిచినట్లు పలువురు కవులు, సాహితివేత్తలు వివరించారు. కార్యక్రమంలో జిల్లాకు చెందిన సాహితీవేత్తలు అప్పాల చక్రధారి, దామెర రాములు, నేరెళ్ల హనుమంతు, పుండలీక్‌రావు, బొందిడి పురుషోత్తం, పత్తి శివప్రసాద్, కరిపే రాజ్‌కుమార్, కృష్ణంరాజు, పోలీస్ భీమేష్ తదితరులు పాల్గొన్నారు.

గండి రామన్న ఆలయం తనిఖీ

నిర్మల్‌టౌన్: జిల్లా కేంద్రంలోని గండి రామన్న సాయిబాబా ఆలయాన్ని దేవాదాయ శాఖ అధికారులు మంగళవారం తనిఖీ చేశారు. నిర్మల్ సాయిసేవాసంఘ్ గండి రామన్న ఆలయం ఆవరణలో నిర్మించిన కళ్యాణ మండపానికి రూ.30 వేలు, ఫొటో షూట్ల పేరిట మరిన్ని డబ్బులు వసూలు చేస్తున్నారని, ఇష్టారీతిన పనులు చేపడుతోందని రాష్ట్ర దేవాదాయ శాఖ కమిషనర్‌కు ఫిర్యాదు చేశారు. ఈ మేరకు ఆదిలాబాద్ దేవాదాయ శాఖ అసిస్టెంట్ కమిషనర్ నవీ న్‌కుమార్ తనిఖీ చేశారు. వివరాలు సేకరించి, ఉన్నత అధికారులకు నివేదిక అందించనున్నట్లు తెలిపారు. ఆయన వెంట దేవాదాయ శాఖ ఇన్‌చార్జి డివిజన్ ఇన్‌స్పెక్టర్ రవికిషన్ తదితరులు ఉన్నారు.

క్లుప్తంగా

మంత్రిని కలిసిన బాసర ఆలయ ఛైర్మన్



మ్యాప్ చూపిస్తున్న అధికారులు

భైంసా: బాసర ఆలయ అధికారులు దేవాదాయశాఖ మంత్రి కొండ సురేఖను మంగళవారం మర్యాద పూర్వకంగా కలిశారు. హైదరాబాద్‌కు వెళ్లిన దేవాదాయ శాఖ స్థపతి వల్లినయగం, ఏఈ రామారావు, దేవస్థాన ఛైర్మన్ శరత్‌పాఠక్‌లు మంత్రిని కలిశారు. మంత్రికి అమ్మవారి ప్రసాదాన్ని అందించారు. ఈ సందర్భంగా బాసర ఆలయ మాస్టర్‌ప్లాన్‌ను వివరించారు. మాస్టర్‌ప్లాన్ పరిశీలించిన అనంతరం మంత్రి సురేఖ జిల్లా కలెక్టర్‌తో మాట్లాడినట్లు ఆలయ అధికారులు తెలిపారు. సాధ్యమైనంత త్వరగా బాసర ఆలయ పునర్నిర్మాణ పనులు ప్రారంభించాలని కోరారు. త్వరలోనే బాసర అమ్మవారి దర్శనానికి రానున్నట్లు మంత్రి తెలిపారని అధికారులు వెల్లడించారు.

పాఠశాల గుర్తింపును రద్దు చేయాలి

ఆదిలాబాద్‌టౌన్: మావలలోని పాఠశాల గుర్తింపును రద్దు చేయాలని ఏఐఎఫ్‌డీఎస్ జిల్లా కార్యదర్శి నవీన్ కుమార్ డిమాండ్ చేశారు. మంగళవారం జిల్లా కేంద్రంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో మాట్లాడారు. ఒకే పేరుతో కార్పొరేట్ పాఠశాలలు ఓ కంపెనీలా మారాయని అన్నారు. ర్యాంకుల పేరుతో విద్యార్థుల కుటుంబాలను ఆర్థికంగా ఇబ్బందులకు గురిచేస్తున్నారని విమర్శించారు. నిబంధనలకు విరుద్ధంగా దోపిడీకి పాల్పడుతున్నారని ఆరోపించారు. విద్యార్థిని పట్ల అసభ్యంగా ప్రవర్తించిన పాఠశాల ప్రిన్సిపల్‌పై కఠిన చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. పాఠశాల యాజమాన్యం నిబంధనలకు విరుద్ధంగా వ్యవహరిస్తున్నప్పటికీ విద్య శాఖాధికారులు పట్టించుకోవడం లేదని వాపోయారు. వెంటనే పాఠశాలను మూసివేయించాలని, లేనియెడల ఆందోళన కార్యక్రమాలను చేపడతామని హెచ్చరించారు.

కొనసాగుతున్న కేజీబీవీ దరఖాస్తు ప్రక్రియ

ఆదిలాబాద్‌టౌన్: కస్తూరిబా గాంధీ బాలికల విద్యాలయాలు (కేజీబీవీ)ల్లో ఖాళీగా ఉన్న ఏఎన్‌ఎం, అకౌంటెంట్, హెడ్‌కుక్, కుక్ పోస్టుల దరఖాస్తుల ప్రక్రియ కొనసాగుతోంది. ఇందులో భాగంగా మంగళవారం డీఈవో కార్యాలయంలో ఏఎన్‌ఎం పోస్టులకు 49మంది అభ్యర్థులు, అకౌంటెంట్ పోస్టుకు 32మంది దరఖాస్తు చేసుకున్నట్లు జిల్లా విద్యాశాఖాధికారి ప్రణీత తెలిపారు. హెడ్ కుక్, అసిస్టెంట్ కుక్ పోస్టులకు సంబంధిత మండలాల ఎంఈవో కార్యాలయాల్లో దరఖాస్తుల స్వీకరణ కొనసాగుతోందని పేర్కొన్నారు. బుధవారంతో దరఖాస్తు ప్రక్రియ ముగియనుందని వివరించారు.

సల్లంబల సందడి..!



పూనకాలతో శివసత్తులు

కుంటాల: మండలంలోని ఓలా గ్రామంలో ఇటీవల శ్రీ వీరాంజనేయ, పెద్దమ్మ తల్లి, రేణుక ఎల్లమ్మ విగ్రహాలను ప్రతిష్ఠించారు. ఈ సందర్భంగా మంగళవారం గ్రామంలో సల్లంబల సందడి నెలకొంది. మహిళలు నెత్తిన బోనాలతో ఊరేగింపుగా ఆలయాలకు చేరుకున్నారు. అమ్మవార్లకు నైవేద్యాలు సమర్పించి మొక్కులు తీర్చుకున్నారు.

మానవీయతకు పెద్దపీట వేయాలి

- జాతీయ సెమినార్‌లో వక్తలు



హాజరైన ప్రొఫెసర్లు



మాట్లాడుతున్న ఏఎస్పీ కాంతిలాల్‌పాటిల్

భైంసాటౌన్: ప్రస్తుత పోటీ ప్రపంచంలో కృత్రిమ మేధ ప్రాధాన్యం పెరిగిపోయి మానవ సంబంధాలు నానాటికి కనుమరుగవుతున్నాయని పలువురు వక్తలు అభిప్రాయపడ్డారు. ఇలాంటి తరుణంలో ప్రతీఒక్కరు మానవీయతకు ప్రాధాన్యం ఇవ్వాల్సిన అవసరముందని నొక్కి చెప్పారు. భైంసాలోని జీఆర్‌పీ ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో మంగళవారం 'మానవీయ సంవేదన, సాహిత్య కే విభిన్న్ స్వర్' అనే అంశంపై ఒకరోజు జాతీయ సెమినార్ నిర్వహించారు. కళాశాలకు చెందిన హిందీ ప్రొఫెసర్ పవన్‌కుమార్ పాండే ఆధ్వర్యంలో నిర్వహించిన ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా భైంసా ఏఎస్పీ కాంతిలాల్‌పాటిల్ హాజరై మాట్లాడారు. భైంసాలో జాతీయస్థాయి సదస్సు నిర్వహించడం అభినందనీయమన్నారు. ఇలాంటి సదస్సుల్లో వివిధ వర్గాలకు చెందిన మేధావులు పలు అంశాలపై చర్చించడం ద్వారా సమాజ వికాసంతోపాటు భాషా సాహిత్యానికి దోహదపడుతోందన్నారు. అనంతరం ఆయా యూనివర్సిటీల నుంచి వచ్చిన హిందీ విభాగాధిపతులు సంబంధిత అంశంపై మాట్లాడారు. అంతకుముందు కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ ఎం.సుధాకర్ రచించిన 'సుశీల టాక్‌భోరే కే సాహిత్య్' అనే పుస్తకం ఆవిష్కరించారు. రీసెర్చి స్కాలర్లు, ప్రొఫెసర్లు, కళాశాల ప్రిన్సిపాల్ ఎం.సుధాకర్, అధ్యాపకులు మధు, మురళీ పాల్గొన్నారు.

అణగారిన వర్గాల గొంతుక...

భారతీయ సమాజంలో నాటి నుంచి అట్టడుగు వర్గాల పట్ల వివక్ష కొనసాగుతోంది. అలాంటి అణగారిన వర్గాల గురించి అంబేద్కర్ తన గొంతుక వినిపించారు. తన రచనల ద్వారా అణగారిన వర్గాలపై చర్చకు తెరతీశారు. ఆయన స్ఫూర్తితో మహారాష్ట్రలోని ఎంతోమంది రచయితలు సాహిత్యాభివృద్ధికి కృషి చేశారు.

– మోహన్ లక్ష్మణ్ చవాన్, హిందీ విభాగం ప్రొఫెసర్, బిట్కో కాలేజ్, నాసిక్ మహారాష్ట్ర

సాహిత్యం కొత్త రూపు సంతరించుకుంటోంది..

మారుతున్న కాలంతోపాటు సాహిత్యం కూడా కొత్త రూపు సంతరించుకుంటోంది. వెయ్యేళ్ల హిందీ సాహిత్యంలో మానవత్వం, సున్నితత్వం సమతుల్యంగా ఉంటున్నాయి. హిందీ సాహిత్యంలో ప్రాచీన కాలం, భక్తి కాలం, ఆచార కాలం, అలాగే ఆధునిక కాలం నాటి మానవ మనోభావాలు పొందుపర్చబడ్డాయి.

– ప్రతిభా యెరేకర్, హిందీ విభాగాధిపతి, లాల్ బహదూర్ శాస్త్రి కాలేజ్, ధర్మాబాద్

బాలింత గుండెకు రంధ్రం

- ఎమ్మెల్యే చొరవతో తప్పిన ప్రాణాపాయం..



కోలుకున్న యశోద

భైంసాటౌన్: పండంటి మగబిడ్డకు జన్మనిచ్చిన ఆ తల్లికి ఆపద వచ్చింది. ఆమెకు గుండెలో రంధ్రం ఏర్పడి శ్వాసనాళాల్లోకి నీరు రావడంతో అపస్మారక స్థితిలోకి వెళ్లగా ఎమ్మెల్యే రామారావు పటేల్ చొరవతో ప్రాణాపాయం తప్పింది. వివరాలిలా ఉన్నాయి.. తానూర్ మండలం జౌల(కె) గ్రామానికి చెందిన యశోద పురిటి నొప్పులతో సోమవారం అర్ధరాత్రి భైంసాలోని ప్రభుత్వ ఏరియాస్పత్రికిలో చేరింది. పరీక్షించిన వైద్యులు ఆపరేషన్ చేయడంతో మగబిడ్డకు జన్మనిచ్చింది. ఈ క్రమంలో శ్వాస సంబంధ సమస్య తలెత్తడంతో అపస్మారకస్థితిలోకి వెళ్లింది. దీంతో బాధితురాలిని వైద్యులు మొదట హైదరాబాద్ తరలించాలని భావించారు. పరిస్థితి విషమంగా ఉండడంతో వైద్యులు, బాధితురాలి కుటుంబీకులు ఎమ్మెల్యే రామారావుపటేల్ దృష్టికి తీసుకెళ్లారు. వెంటనే స్పందించిన ఆయన మహారాష్ట్రకు చెందిన కార్డియాలజిస్ట్ డాక్టర్ అరుణ్‌ను ఫోన్‌లో సంప్రదించి భైంసా ఆస్పత్రికి పిలిపించారు. హుటాహుటిన చేరుకున్న ఆయన ఏరియా ఆస్పత్రి సూపరింటెండెంట్ కాశీనాథ్‌తో కలిసి పరీక్షించగా ఆమెకు ఇదివరకే గుండెలో రంధ్రం ఉండడంతో శ్వాసనాళాల్లోకి నీరు చేరి ఇబ్బంది తలెత్తినట్లు గుర్తించారు. వెంటనే అవసరమైన చికిత్స అందించగా ప్రస్తుతం ఆమె కోలుకుంది. దీంతో బాలింత కుటుంబీకులు ఎమ్మెల్యేతోపాటు వైద్యులకు కృతజ్ఞతలు తెలిపారు.

భార్యపై హత్యాయత్నం

ఆదిలాబాద్‌రూరల్: భార్యపై అనుమానంతో బ్లేడ్‌తో గొంతుకోసి హత్యాయత్నానికి పాల్పడిన సంఘటన సోమవారం అర్ధరాత్రి మండలంలోని భీంసరి గ్రామంలో చోటుచేసుకుంది. ఎస్సై ముజాహిద్ కథనం ప్రకారం.. భీంసరి గ్రామానికి చెందిన జక్కుల కమల – చంద్ర కుమార్ భార్యాభర్తలు. వీరికి ఇద్దరు పిల్లలు. భర్త చంద్రకుమార్ మద్యం తాగి భార్యను అనుమానించేవాడు. ఇదే క్రమంలో సోమవారం అర్ధరాత్రి భార్యను బ్లేడ్‌తో గొంతుకోసి హత్య చేసే ప్రయత్నం చేశాడు. పిల్లలు అప్రమత్తం కావడంతో ఆమె ప్రాణాలతో బయటపడింది. అనంతరం ఆమెను చికిత్స నిమిత్తం జిల్లా కేంద్రంలోని రిమ్స్ ఆసుపత్రికి తరలించారు. మంగళవారం బాధితురాలి ఫిర్యాదు మేరకు భర్తపై కేసు నమోదు చేసినట్లు ఎస్సై తెలిపాడు.

రైలు కిందపడి వ్యక్తి మృతి



గుర్తుతెలియని వ్యక్తి మృతదేహం

భైంసా: రైలు కిందపడి గుర్తుతెలియని వ్యక్తి ఆత్మహత్య చేసుకున్నట్లు నిజామాబాద్ రైల్వేస్టేషన్ ఎస్సై సాయారెడ్డి తెలిపారు. బాసర రైల్వే స్టేషన్ పరిధిలోని మల్కాపూర్, గుండారం శివారు ప్రాంతంలో రైలు కింద పడి 30–35 ఏళ్ల వయస్సు ఉన్న వ్యక్తి ఆత్మహత్య చేసుకున్నట్లు అనుమానిస్తున్నారు. మృతుడి వివరాలు ఎవరికైనా తెలిస్తే 94405 16146 నంబరులో సంప్రదించాలని సూచించారు.

గుర్తు తెలియని వృద్ధురాలు మృతి

ఇంద్రవెల్లి: గుర్తుతెలియని వృద్ధురాలు మృతిచెందిన సంఘటన మంగళవారం మండలంలోని ముత్నూర్ గ్రామంలో చోటుచేసుకుంది. స్థానిక ఎస్సై దుబ్బక సునీల్, ముత్నూర్ గ్రామస్తుల వివరాల ప్రకారం... ఏడాదిగా ఓ గుర్తు తెలియని వృద్ధురాలు (80) ముత్నూర్ గ్రామంలో బిచ్చమడుకుతూ జీవిస్తోంది. మంగళవారం ఉదయం ముత్నూర్ గ్రామానికి కొంత దూరంలోని ఓ వ్యాపార దుకాణం ఎదుట మృతిచెంది కనిపించగా గ్రామస్తులు పోలీసులకు సమాచారం ఇచ్చారు. ఎస్సై సంఘటనా స్థలానికి చేరుకుని వివరాలు సేకరించారు. మృతదేహాన్ని ఉట్నూర్ ప్రభుత్వ ఆస్పత్రిలోని మార్చురీకి తరలించారు. మృతురాలి బంధువులు ఎవరైనా ఉంటే ఇంద్రవెల్లి పోలీసుస్టేషన్‌లో సంప్రదించాలని కోరారు.

భిక్షాటనకు వచ్చి.. చోరీ

- సీసీ పుటేజీల్లో వెలుగుచూసిన దృశ్యం




ఎత్తుకెళ్లిన డ్రైనేజీపై మూత



సీసీ పుటేజీలో ఇంటి ముందట భిక్షాటకులు

ఖానాపూర్: పట్టణంలోని రాజీవ్‌నగర్‌కాలనీలో పలువురు వ్యక్తులు భిక్షాటనకు వచ్చారు. కాసేపు గేటు వద్ద వేచి చూసినప్పటికీ లోనికి వెళ్లే మార్గం లేకపోవడంతో చివరకు ఇంటి గేటు ముందు గల డ్రైనేజీపై ఉన్న ఐరన్ మూతను ఎత్తుకెళ్లారు. ఈ దృశ్యాలన్నీ కాలనీలోని సీసీ కెమెరాలో రికార్డు కావడంతో ఇంటి యజమాని జక్క పరిమళ్ కాలనీ వాసులను అప్రమత్తం చేసేందుకు సీసీ పుటేజీని సోషల్ మీడియా గ్రూపుల్లో పోస్ట్ చేశాడు. ఇటీవల కాలనీకి చెందిన ఫ్రెండ్స్ సొసైటీ ఆధ్వర్యంలో సుమారు రూ.2లక్షలతో కాలనీవాసులు సీసీ కెమెరాలు ఏర్పాటు చేసుకున్నారు. సీసీ కెమెరాలు ఏర్పాటు చేసిన మొదటిరోజే కాలనీలోని రాజేశ్వర్‌గౌడ్ నివాసానికి ఓ దొంగ వచ్చి ఇంట్లో ఏమి లభించకపోవడంతో చివరకు మద్యం బాటిళ్లను ఎత్తుకెళ్లిన దృశ్యాలు సీసీ కెమెరాలో రికార్డయ్యాయి. తాజాగా ఐరన్ మూత చోరీ చేసిన దృశ్యం కూడా సీసీ కెమెరాలో రికార్డు కావడంతో ప్రజలు అప్రమత్తం అవుతున్నారు. ఈ విషయమై పోలీసుల దృష్టికి తీసుకెళ్లాలని పరిమళ్ తెలిపాడు.

అటవీశాఖ అధికారులకు జింక అప్పగింత



అధికారులకు జింకను అప్పగిస్తున్న పోలీసులు

తానూరు: గాయాలపాలైన జింకను మంగళవారం అటవీశాఖ అధికారులకు అప్పగించినట్లు ఎస్సై సందీప్ తెలిపారు. ఆయన తెలిపిన వివరాల ప్రకారం .. బోల్సా శివారు ప్రాంతంలో జింకను కుక్క వెంబడించడంతో గాయాలపాలైంది. గమనించిన రైతులు జింకను తానూరు పోలీస్‌స్టేషన్‌కు తరలించారు. పోలీసులు అటవీశాఖ అధికారుల సమాచారం అందించి వారికి జింక అప్పగించినట్లు ఎస్సై తెలిపారు. గాయాలపాలైన జింకను బాసరకు తరలించి ప్రథమ చికిత్స అందిస్తామని అటవీశాఖ అధికారులు తెలిపారు. అటవీ శాఖ బీట్ అధికారి మహేశ్, సిబ్బంది తదితరులు ఉన్నారు.

రైల్వేస్టేషన్ అభివృద్ధికి చర్యలు

- వేగవంతంగా పిట్‌లైన్ పనులు
- ఎస్‌సీఆర్ ఏజీఎం ధనుంజయులు



రైల్వేస్టేషన్‌ను పరిశీలిస్తున్న ఏజీఎం

ఆదిలాబాద్: అమృత్ భారత్ పథకం కింద ఎంపికైన ఆదిలాబాద్ రైల్వేస్టేషన్ అభివృద్ధికి అన్ని చర్యలు తీసుకుంటున్నామని దక్షిణ మధ్య రైల్వే ఏజీఎం ఆర్.ధనుంజయులు అన్నారు. జిల్లా కేంద్రంలోని రైల్వే స్టేషన్‌ను మంగళవారం పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన రైల్వేస్టేషన్ ఆధునీకరణ పనుల ప్రణాళికలను గురించి అధికారులను అడిగి తెలుసుకున్నారు. ఇటీవల రైల్వే ఉద్యోగుల కోసం ఏర్పాటు చేసిన హెల్త్ యూనిట్‌ను సందర్శించిన ఆయన పిట్‌లైన్ పనుల పురోగతి వివరాలను గురించి ఆరా తీశారు. రైల్వే స్టేషన్‌లో సమకూర్చాల్సిన వసతుల గురించి అధికారులకు సూచనలు చేశారు. ఈ సందర్భంగా ఆయన మీడియాతో మాట్లాడుతూ అమృత్ భారత్ పథకం కింద ఆదిలాబాద్ రైల్వే స్టేషన్ ఆధునీకరణ పనులకు నిధులు మంజూరయ్యాయన్నారు. పిట్‌లైన్ పనులు పురోగతిలో ఉన్నాయని, రాబోయే కొన్ని నెలల్లో పూర్తిచేస్తామన్నారు. రైల్వే స్టేషన్‌లో 12 మీటర్ల వెడల్పుతో మరో ఫుట్ ఓవర్ బ్రిడ్జి, మూడు లిఫ్టులు నిర్మిస్తామన్నారు. ఆగస్టు నాటికి పనులు పూర్తయ్యేలా చర్యలు తీసుకుంటామన్నారు.

కుమురంభీం ప్రాంగణాన్ని తీర్చిదిద్దాలి

- ఐటీడీఏ పీవో చాహత్ బాజ్‌పాయ్



పనులు ప్రారంభిస్తున్న పీవో చాహత్ బాజ్‌పాయ్



హాజరైన ఆయా శాఖల అధికారులు

ఉట్నూర్‌రూరల్: మండల కేంద్రంలోని కుమురం భీం ప్రాంగణాన్ని (కేబీ కాంప్లెక్స్)ను సుందరంగా తీర్చిదిద్దాలని ఐటీడీఏ ప్రాజెక్టు అధికారి చాహత్ బాజ్‌పాయ్ అధికారులను ఆదేశించారు. మంగళవారం కేబీ కాంప్లెక్స్‌లో రాజమండ్రి నుంచి తెప్పించిన అరుదైన మొక్కలు నాటి సుందరీకరణ పనులను శిక్షణ సహాయ కలెక్టర్ వికాస్ మహతో కలిసి ప్రారంభించారు. ఈ సందర్భంగా పీవో మాట్లాడుతూ.. కుమురంభీం కాంప్లెక్స్ ద్వారం నుంచి విగ్రహం వరకు, పరిసరాలు, పీఎంఆర్సీ గెస్ట్‌హౌజ్, మీటింగ్ హాల్ పరిసరాల్లో అలంకరణ, పూల మొక్కలు నాటనున్నట్లు తెలిపారు. రాజమండ్రి నుంచి తెప్పించిన పలు మొక్కలు నాటుతున్నట్లు తెలిపారు. త్వరలో ఉట్నూర్‌లో నిర్వహించే రాష్ట్ర స్థాయి ఇంటర్ సొసైటీ స్పోర్ట్స్ లీగ్ పనులను త్వరి తగతిన పూర్తి చేయాలని ఆదేశించారు. కార్యక్రమంలో ఈఈ రాథోడ్ భీంరావు, పీహెచ్‌వో సందీప్ కుమార్, జిల్లా క్రీడా అధికారి పార్థసారథి పాల్గొన్నారు.

ఇంటర్ సొసైటీ లీగ్ పోటీలను పకడ్బందీగా నిర్వహించాలి

ఇంటర్ సొసైటి లీగ్ క్రీడా పోటీలను పకడ్బందీగా నిర్వహించాలని ఐటీడీఏ ప్రాజెక్టు అధికారిణి చాహత్ బాజ్‌పాయ్ అధికారులను ఆదేశించారు. మంగళవారం సాయంత్రం ఐటీడీఏ కార్యాలయంలోని తన చాంబర్‌లో ఇంటర్ సొసైటి లీగ్ (ఐఎస్‌ఎల్) క్రీడా పోటీల నిర్వాహణపై సంబంధిత శాఖల అధికారులతో ఆమె సమీక్ష సమావేశం నిర్వహించి మాట్లాడారు. ఈ నెల 17 నుండి 20 వరకు నిర్వహించే ఐఎస్‌ఎల్ పోటీలకు ఎలాంటి లోటుపాట్లు లేకుండా ఘనంగా నిర్వహించాలన్నారు. సాంస్కృతిక ప్రదర్శనలు ఏర్పాటు చేయాలని తెలిపారు. సమావేశంలో శిక్షణ సహాయ కలెక్టర్ వికాస్ మహతో, డీడీ దిలీప్‌కుమార్, గిరిజన క్రీడల అధికారి పార్థసారథి, ఆసిఫాబాద్, నిర్మల్, మంచిర్యాల డీటీడీఓలు రమాదేవి, అంబాజీ, గంగారాం, ఏవో రాంబాబు పాల్గొన్నారు.

ఆహ్లాదకర వాతావరణంతోనే ప్రశాంతత

- ఆర్టీసీ ఉమ్మడి జిల్లా రీజినల్ మేనేజర్ సోలోమన్



ఉద్యోగులకు వడ్డన చేస్తున్న రీజనల్ మేనేజర్

ఆదిలాబాద్: ఆహ్లాదకర వాతావరణంతోనే మానసిక ప్రశాంతత సాధ్యమని ఆదిలాబాద్ ఆర్టీసీ రీజినల్ మేనేజర్ సోలోమన్ అన్నారు. జిల్లా కేంద్రంలోని ఆర్టీసీ డిపోలో మంగళవారం వనభోజన మహోత్సవ కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఆర్టీసీ ఉద్యోగులకు ప్రత్యేక భోజన వసతిని కల్పించారు. అదేవిధంగా ఆర్టీసీ ఉద్యోగులకు క్రీడా పోటీలను ఏర్పాటు చేయగా, వారు ఉత్సాహంగా పాల్గొన్నారు. ఈ సందర్భంగా రీజినల్ మేనేజర్ సోలోమన్ మాట్లాడుతూ ఉద్యోగుల్లో ఉత్తేజాన్ని పెంపొందించాలనే ఆర్టీసీ ఎండీ సజ్జనార్ ఆదేశాల మేరకు ఈ కార్యక్రమానికి శ్రీకారం చుట్టామన్నారు. ఉద్యోగులందరూ ఉత్సాహంగా ఈ కార్యక్రమంలో పాల్గొనేలా కృషి చేశామన్నారు. ఉద్యోగులందరూ స్నేహపూర్వక వాతావరణంలో మెలగాలని సూచించారు. విధి నిర్వహణలో ఒత్తిడి సహజమని ఒత్తిడిని దూరం చేయడానికి ఇటువంటి కార్యక్రమాలు ఎంతగానో దోహదం చేస్తాయన్నారు. ఆర్టీసీ ఉద్యోగుల సంక్షేమం కోసం ప్రత్యేక శ్రద్ధ వహిస్తున్నామని పేర్కొన్నారు. ఈ నేపథ్యంలోనే వనభోజనాలు కార్యక్రమాన్ని ఏర్పాటు చేయడం జరిగిందని, ప్రతి ఒక్క ఉద్యోగి ఈ కార్యక్రమంలో పాల్గొనాలని సూచించారు. ఈ కార్యక్రమంలో డీటీసీ పుప్పాల శ్రీనివాస్, ఆదిలాబాద్ డిపో మేనేజర్ కల్పన తదితరులున్నారు.

మంత్రిని కలిసిన సెకండ్ ఏఎన్‌ఎంలు



వినతిపత్రం అందిస్తున్న సెకండ్ ఏఎన్‌ఎంలు

ఆదిలాబాద్‌టౌన్: జిల్లాలో పనిచేస్తున్న సెకండ్ ఏఎన్‌ఎంలు వైద్య ఆరోగ్య శాఖ మంత్రి దామోదర రాజనర్సింహను కలిశారు. మంగళవారం హైదరాబాద్‌లో కలిసి సమస్యలపై వినతి పత్రాన్ని అందజేశారు. ఈ సందర్భంగా ఏఎన్‌ఎంలు మాట్లాడుతూ నేషనల్ హెల్త్ మిషన్‌లో పనిచేస్తున్న తమను రెగ్యులర్ చేయాలని పేర్కొన్నారు. దీంతో పాటు ఇతర సమస్యలను ఆయన దృష్టికి తీసుకెళ్లారు. సానుకూలంగా స్పందించిన మంత్రి వైద్య ఆరోగ్య శాఖలో ఉద్యోగులు ఎదుర్కొంటున్న సమస్యలను దశలవారీగా పరిష్కరించేందుకు కృషి చేస్తానని హామీ ఇచ్చినట్లు పేర్కొన్నారు. మమత, జె.పద్మ, ఎస్.వసంత, డి.సుజాత ఉన్నారు.

సర్వేను అడ్డుకున్న గొండుగూడ వాసులు



స్థానికులతో మాట్లాడుతున్న సర్వేయర్లు

కడెం: మండలంలోని నచ్చన్‌ఎల్లాపూర్ పంచాయతీ పరిధిలోని పెత్తర్పు సమీపంలో అటవీ భూమిని సర్వే చేసేందుకు వచ్చిన సర్వేయర్లను గొండుగూడ వాసులు అడ్డుకున్నారు. పునరావాస ప్యాకేజీలో భాగంగా రాంపూర్, మైసంపేట్ గ్రామల్లోని 94 కుటుంబాలకు వ్యవసాయ భూమిని అప్పగించేందుకు సర్వే నిర్వహిస్తున్నారు. పోడు వ్యవసాయం కోసం ఈ భూములను తాము ఇరవై ఏళ్ల క్రితమే చెట్లు నరికి పోడు సాగు చేస్తున్నామని, రాంపూర్, మైసంపేట్ వాసులతో పాటుగా గొండుగూడలోని ఇరవై కుటుంబాలకు భూములు కేటాయించాలని డిమాండ్ చేశారు. ఈ భూములు మీ కోసమే సర్వే చేస్తున్నామని గొండుగూడ వాసులకు సర్వేయర్లు నచ్చచెప్పి గ్రౌండ్ లెవెల్ సర్వే చేశారు. ఇందులో రాజ్‌గొండ్ సేవా సమితి జిల్లా అధ్యక్షుడు ఆత్రం రాజేశ్వర్, ప్రధాన కార్యదర్శి ఆత్రం భీంరావు, దస్తురాబాద్ మండలాధ్యక్షుడు రాజేందర్, కుర్సెంగ దేవు, మహేశ్, లక్ష్మణ్, పాండురావు ఉన్నారు.

రాష్ట్రస్థాయిలో పోటీల్లో లక్ష్మీపూర్ విద్యార్థి



హరిఓం

జైనథ్: మండలంలోని లక్ష్మీపూర్ జెడ్పీ ఉన్నత పాఠశాలకు చెందిన 7వ తరగతి విద్యార్థి ఎస్.హరిఓం ప్రతిభ చాటాడు. మాచరాజు బాల సాహిత్య పీఠం హైదరాబాద్ వారి ఆధ్వర్యంలో నిర్వహించిన బడిపిల్ల ల కథ పోటీల్లో హరిఓం రాసిన సమయస్ఫూర్తి కథ ఎంపికైనట్లు పాఠశాల ప్రధానోపాధ్యాయుడు పోరెడ్డి అశోక్ మంగళవారం తెలిపాడు. ఈ ఏడాది రాష్ట్ర వ్యాప్తంగా 45మంది విద్యార్థులు కథలు పంపించగా 22 కథలను మాచరాజు బాల సాహిత్య పీఠం వారు ప్రచురణార్థం ఎంపిక చేశారు. త్వరలోనే ఈ కథలతో పుస్తకం తయారు చేయనున్నట్లు ప్రధానోపాధ్యాయులు తెలిపారు. హరిఓంను ఎంపీటీసీ కామ్రే జయమాల మనోజ్, సర్పంచ్ దాసరి లక్ష్మి రాములు, ఉపసర్పంచ్ గాజంగుల స్వామి, ఉపాధ్యాయులు హన్మంత్‌రావు, నారాయణ అభినందించారు.

ప్రతిభ కళాశాలల ప్రవేశం నోటిఫికేషన్ విడుదల

ఆదిలాబాద్‌రూరల్: తెలంగాణ సాంఘిక సంక్షేమ గురుకులాల సొసైటీ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న ప్రతిభ కళాశాలల్లో (సీవోఈ–సెంటర్ ఆఫ్ ఎక్సలెన్స్ కళాశాలలు) 2024–25 విద్యా సంవత్సరంలో ప్రవేశాలకు నోటిఫికేషన్ విడుదలైందని ఆదిలాబాద్ సాంఘిక సంక్షేమ గురుకుల కళాశాల ప్రిన్సిపాల్, డీసీవో శ్రీనివాస్ తెలిపారు. రాష్ట్రంలోని 38 ప్రతిభ గురుకుల కళాశాలల్లో ప్రథమ సంవత్సరంలో ఎంపీసీ, బైపీసీ, ఎంఈసీ, సీఈసీ గ్రూపుల్లో ప్రవేశాలకు దరఖాస్తులను ఆహ్వానించడం జరుగుతుందన్నారు. ఆసక్తి గల విద్యార్థులు ఆన్‌లైన్‌లో ఈ నెల 15వరకు దరఖాస్తు చేసుకోవాలన్నారు. ఈ కళాశాలల్లో జేఈఈ మెయిన్స్, అడ్వాన్స్, నీట్, ఎంసెట్, క్లాట్, సీఏ వంటి పోటీ పరీక్షలకు అత్యుత్తమ శిక్షణ అందిస్తారని తెలిపారు. విద్యార్థులకు ఉచిత భోజన, వసతి సౌకర్యాలతో పాటు స్టడీ మెటీరియల్ అందిస్తారని పేర్కొన్నారు. ప్రవేశ పరీక్షలో ప్రతిభ ఆధారంగా సీట్ల కేటాయింపు ఉంటుందన్నారు. అలాగే ఎస్సీ, ఎస్టీ, బీసీ, జనరల్ గురుకులాల్లో 5వ తరగతి ప్రవేశ పరీక్షకు దరఖాస్తుల స్వీకరణ గడువును ఈ నెల 20 వరకు పొడిగించినట్లు తెలిపారు.

రోడ్డు ప్రమాదంలో ముగ్గురికి గాయాలు

దిలావర్‌పూర్: మండలంలోని గుండంపల్లి గ్రామంలో మంగళవారం జరిగిన రోడ్డు ప్రమాదంలో ముగ్గురికి గాయాలయ్యాయి. ఇందులో మండలంలోని కాండ్లి గ్రామానికి చెందిన గుమ్ముల గణేష్, మహారాష్ట్రకు చెందిన శంకర్ తీవ్రంగా గాయపడ్డారు. స్థానికుల కథనం మేరకు... కాండ్లి గ్రామానికి చెందిన గుమ్ముల గణేష్ అనే యువకుడు పని నిమిత్తం ద్విచక్రవాహనంపై నిర్మల్ వెళ్తున్నాడు. మహారాష్ట్రకు చెందిన శంకర్‌తో పాటు మరో వ్యక్తి ద్విచక్రవాహనంపై గుండంపల్లికి వేగంగా వస్తూ ఎదురుగా వస్తున్న బైక్‌ను ఢీకొన్నారు. గణేష్, శంకర్‌కు తీవ్రంగా, మరో యువకుడికి స్వల్పగాయాలయ్యాయి. గణేష్ పరిస్థితి విషమంగా ఉన్నట్లు స్థానికులు వెల్లడించారు. ఎస్సై యాసిర్ అరాఫత్‌ను వివరణ కోరగా తమ దృష్టికి వచ్చిందని, బాధితుల ఫిర్యాదు మేరకు కేసు దర్యాప్తు చేస్తామన్నారు.

లారీ ఢీకొని.. యువకుడు దుర్మరణం

నర్సాపూర్(జి): రోడ్డు ప్రమాదంలో యువకుడు దుర్మరణం చెందిన సంఘటన మండలంలో మంగళవారం చోటుచేసుకుంది. వివరాల ప్రకారం... మండలంలోని తురాటి గ్రామశివారు పెద్ద చెరువు సమీపంలోని 61వ జాతీయ రహదారిపై మహారాష్ట్రలోని నాందేడ్ జిల్లా బురక్ వాడీ గ్రామానికి చెందిన రవి శివాజీ గమేవాడ్ (24) ద్విచక్ర వాహనంపై నిర్మల్ వైపు వెళ్తున్నాడు. ఈ క్రమంలో ఎదురుగా వస్తున్న లారీ ఢీకొంది. ఈ ప్రమాదంలో తలకు తీవ్ర గాయాలై రక్తస్రావంతో మృతిచెందాడు. సంఘటనా స్థలాన్ని పోలీసులు పరిశీలించి మృతదేహాన్ని నిర్మల్ ఏరియా ఆసుపత్రికి తరలించారు. లారీ డ్రైవర్ పరారీ కాగా క్లీనర్‌ను అదుపులోకి తీసుకొని విచారిస్తున్నట్లు ఎస్సై పేర్కొన్నారు.